క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. మంగలపల్లి రాజయ్య, కుమారస్వామి, నగేష్, రమేష్ చేరినవారిలో ఉన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఆముదాలపల్లి అశోక్, పల్లెబోయిన రాజు, రవీందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

శారద స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పరకాల: పట్టణంలోని శారద విద్యాలయం హైస్కూల్‌లో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు రంగుల దుస్తులు ధరించి ఆడిపాడారు. అనంతరం గ్యాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు సుజిని, నిరోష, భార్గవి, మంజుల, స్వప్న, వనిత, హైమ, రజిత, ప్రవీణ పాల్గొన్నారు.

సివిల్స్ విజేతకు సన్మానం



ఆత్మకూరు : ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 103వ ర్యాంకు సాధించిన హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సూదాటి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నడికూడ : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని పరకాల–హుజూరాబాద్ ప్రధానరహదారిపై గురువారం పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేశారు.

'డీఆర్‌ఆర్' ట్రస్ట్ సేవలు అభినందనీయం

నర్సంపేట రూరల్ : దాసరి రాజిరెడ్డి (డీఆర్‌ఆర్) ఎడ్యూకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు నిర్వహించడం అభినందనీయమని నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ గోపాల్, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన దాసరి సాంబరెడ్డి స్మారకంగా ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సంపేటలోని ఆరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం డాక్టర్ గోపాల్, ప్రసన్నలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేలా పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ట్రస్టు ప్రతినిధి మేకల రాజేందర్ మాట్లాడారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో, నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, మాదన్నపేట ఆటో స్టాండ్ వద్ద, వ్యవసాయ మార్కెట్ వద్ద, అంగస్ సెంటర్, పాకాల్ సెంటర్ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు, పాదచారులు చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మద్యం, టవేరా వాహనం స్వాధీనం

వర్ధన్నపేట : అనుమతి లేకుండా మద్యం సరఫరా చేస్తున్న టవేరా వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలీసు సిబ్బంది సురేశ్, దామోదర్ ఇల్లంద శివారులో కట్ర్యాల దిశగా వెళ్తున్న టవేరా వాహనాన్ని అనుమానించి అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో 96 కింగ్ ఫిషర్ బీర్లు ఉండడాన్ని గుర్తించి మద్యంతోపాటు వాహనాన్ని అదుపులోకి తీసుకుని వాహన యజమాని పర్వతగిరి మండలంలోని గోపనపెల్లికి చెందిన బోయిని దామోదర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మలుపులు.. మృత్యు పిలుపులు

- కానరాని సూచికలు
- ఎదురెదురుగా వాహనాలొస్తే అంతే..
- ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు



కక్కిరాలపల్లి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఐనవోలు : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. దీంతో మండలంలోని కక్కిరాలపల్లి మీదుగా నందనం ప్రయాణించే వాహన దారులు భయాందోళన చెందుతున్నారు. ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లి క్రాస్ నుంచి ఆర్‌అండ్‌బీ బీటీ ద్వారా నందనం గ్రామానికి సుమారు 9 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ముఖ్యంగా కక్కిరాలపల్లి నుంచి రాంనగర్ నందనం గ్రామాల నడుమ ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది. 9 కిలోమీటర్లలో చాలా చోట్ల మలుపులు ఉండగా ఐదారు చోట్ల మృత్యు పిలుపులుగా మారాయి. రోడ్డుకు ఇరువైపుల పిచ్చి, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. దూరం నుంచి హారన్ మోగిస్తే కానీ ఎదురుగా వాహనం వస్తుందని గమనించే అవకాశం లేదు. కొన్ని చోట్ల రోడ్డుకు ఆనుకుని కందకాలు ఉండటం అత్యంత ప్రమాదకరంగా మారింది. మలుపుల కారణంగా పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. దట్టంగా పొదలు పెరిగి ఉండటంతో కొన్ని ట్రాక్టర్లు కూడా ప్రక్కన కందకాల్లో పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ మార్గం గుండా రాత్రి, తెల్లవారు జామున ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. మలుపు రోడ్డు వలన గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతిచెందినప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేదని వాహన దారులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మలుపుల వద్ద ఇసుక ఉండడంతో బైక్‌పై ప్రయాణించే వాహనదారులు స్కిడ్ అయ్యి కిందపడి గాయాల పాలవుతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద రోడ్డు వెడల్పుతో పాటు స్టాపర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మలుపు వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డు



ప్రమాదకరంగా మలుపు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



వాహన దారులను అప్రమత్తం చేసేందుకు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలి. రోడ్డుకిరువైపుల పిచ్చి, ముళ్ల చెట్లు పెరగడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఇప్పటికే పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ చొరవచూపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

–గూబ దేవేందర్, వాహనదారుడు

వాహనాల వేగాన్ని నియంత్రించాలి



ఈ రోడ్డును ఎవరు పట్టించుకుంటలేరు. తెల్లవారు జామున ఆకేరు వాగు నుంచి వరంగల్‌కు వెళ్లే ఇసుక ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్తున్నాయి. ఆ సమయంలో ఇటువైపుగా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు పోలీసులు, ఇతర శాఖల అధికారులు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి.

–యాకర నర్సింగం, నందనం

'ఉపాధిహామీ'లో రోజుకు రూ.600 చెల్లించాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న మనోహర్



దామెర : కూలీలతో మాట్లాడుతున్న కరుణాకర్

ఎల్కతుర్తి : ఉపాధిహామీ పనుల్లో కొలతల నిబంధనలు సడలించి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 28 రూపాయలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని, దాంతో కూలీలకు ఒరిగిందేమి లేదన్నారు. ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాల్లో అధికారులు వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని, కూలీలకు కావాల్సిన రెస్టు సెంటర్, టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ బూరుగు వెంకటమ్మ వడదెబ్బతో మృతి చెందిందని, ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి శనిగరపు రాజకుమార్, తండ మొండయ్య, గడ్డం రాజనర్సు, మర్రి విజయ్, యాళ్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీబీఎఫ్ ఆధ్వర్యంలో..

దామెర: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం శివారులోని చెరువులో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు నీడ, మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పనిచేసిన 15 రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అన్నారు. పెండిగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సారంగం, మేట్లు, కూలీలు ఉన్నారు.

'రైస్‌లైఫ్లీ' స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

దామెర: రైస్‌లైఫ్లీ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఊరుగొండ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోరిక రమాదేవి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు చల్లా రాజిరెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండ ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు రైస్‌లైఫ్లీ సంస్థ తరఫున ఒక్కొక్కరికి 25 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించి పేద విద్యార్థులకు తోడుగా నిలవాలని కోరారు. సంస్థ ప్రతినిధులు కోనికాంత్, రిత్విక్ రాజ్, టీవీఎస్ రత్నరాజు, గ్లోరి, ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, సమత, జయ, విజిత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమ పాల్గొన్నారు.



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మోదీ పాలనలో మతకలహాలు లేవు

- బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి

ఐనవోలు : ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పదేళ్లుగా దేశంలో మత కలహాలు, బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు లేవని.. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు కట్కూరి బెన్సన్, పిట్టల శ్యామ్‌లతో పాటు మరో 50 మంది బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 100 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం, దేశం కోసం, పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి కోసం అందరూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వివిధ సంఘాల నాయకులు శేఖర్, పరశరాములు, సాయిలు, రమేశ్, రవీందర్, పుల్లయ్య, నర్సింహులు, కుమారస్వామి తదితరులు చేరిన వారిలో ఉన్నారు. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్, మండల అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, వనం రెడ్డి, జైపాల్, రాజేందర్, ప్రభాకర్, లూతర్, ప్రణయ్, నాగరాజు, కిరణ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న అరూరి రమేశ్

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ

ధర్మసాగర్ : కేంద్రంలో అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం పదేళ్లు గడుస్తున్నా చేయకుండా మాదిగలను మోసం చేస్తుందని తెలంగాణ మాదిగకుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టే పద్మయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసిన బీజేపీ ప్రభుత్వంతో మంద కృష్ణమాదిగ వంతకాగుతూ మాదిగల అస్తిత్వాన్ని తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. మతతత్వ బీజేపీ హిందూ మతం పేరుతో దళిత ఉపకులాలపై, వివిధ వర్గాలపై అనేక దాడులకు పాల్పడుతుందని అన్నారు. మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం ప్రమాదంలో పడే అవకాశం ఉందని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధాలనాపై మాదిగలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దళితులకు రూ.12 లక్షలు బీఆర్ అంబేడ్కర్ అభయహస్తం పథకానికి శ్రీకారం చుట్టాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. టీఎంహెచ్‌డీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంగీత్, తెలంగాణ మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ప్రసాద్, సమ్మయ్య, నరేందర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొట్టే పద్మయ్య

కడియం శ్రీహరిని విమర్శిస్తే సహించేది లేదు

వేలేరు : ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు సద్దాంహుస్సేన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం కోల్పోగానే బీఆర్‌ఎస్ నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆరు నెలల్లో మండలం మొత్తానికి సాగునీరు తీసుకువస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ నేతలు పూర్తిస్థాయిలో ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి తన స్వలాభం కోసం పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసం మారాడని స్పష్టం చేశారు. కడియం శ్రీహరి ఎవరి కాళ్ల వద్దకు వెళ్లలేదని, లేనిపోని విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, బుచ్చిరెడ్డి, అక్కల శంకర్, సలీంమాలీక్, దుర్గరాజు, ప్రశాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సద్దాంహుస్సేన్

మందకృష్ణను విమర్శించే హక్కు రేవంత్‌కు లేదు

కమలాపూర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను విమర్శించే నైతికహక్కు సీఎం రేవంత్‌రెడ్డికు లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోడేటి రాజు అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీ టికెట్ల కేటాయింపులో రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. దేశం మొత్తం మాదిగల వైపు చూసేలా చేసిందే మంద కృష్ణమాదిగ అని, జన జాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మంద కృష్ణమాదిగను విమర్శించడం సరికాదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, బీజేపీ తరఫున ప్రచారం కూడా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు రవితేజ, కుమార్, శంకర్, పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా దేవాదుల క్వార్టర్లు
- 3 ఎకరాల్లో 30 భవనాల నిర్మాణం
- శిథిలావస్థకు చేరుకున్న నివాసాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సాంఘిక సంక్షేమ పాఠశాలకు ఉపయోగించుకున్న భవనం

ధర్మసాగర్ : దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తుల నివాసం కోసం ధర్మసాగర్ మండల కేంద్రంలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. దేవాదుల పంప్‌హౌజ్‌లో పని చేస్తున్న సిబ్బంది, వారి కుటుంబాలు నివాసం ఉండేందుకు ప్రభుత్వ సముదాయాల సమీపంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దాదాపు 3 ఎకరాల స్థలం కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ గోడ, అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రైనేజీ, తాగునీటి వసతి కోసం ప్రత్యేకంగా ఓవర్ హెడ్ ట్యాంకుతో కూడిన సుమారు 30 క్వార్టర్లను నిర్మించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ క్వార్టర్లను 2006 సంవత్సరంలో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి క్వార్టర్లను సంబంధిత శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. కొంత కాలం తరువాత నిరుపయోగంగా ఉన్న భవనాలను తాత్కాలిక ప్రాతిపదికన ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి తరగతులను కొనసాగించారు. అయితే విద్యార్థులకు కావాల్సిన వసతి లేకపోవడంతో మూడు సంవత్సరాల క్రితం ఆ పాఠశాలను హనుమకొండ నగరానికి తరలించారు.

ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను హనుమకొండకు తరలించడంతో అప్పటి నుంచి క్వార్టర్లు పూర్తిగా నిరుపయోగంగా మారి శిథిలావస్థలకు చేరుకున్నాయి. భవనాల చుట్టూ ముళ్లచెట్లు ఏపుగా పెరగడంతో పందులు, కుక్కలు, విషపురుగులకు స్థావరంగా మారాయి. ప్రహరీ చుట్టూ పగుళ్లతేలడంతోపాటు గేటు ధ్వంసమై తలుపులు పగుళ్ల బారినపడ్డాయి. ఇప్పటికై నా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి దేవాదుల క్వార్టర్లకు మరమ్మతులు చేయించి సిబ్బందికి, ఉద్యోగస్తులకు కేటాయించాలని, లేదా ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవాలని పలువురు కోరుతున్నారు. లేనిపక్షంలో కార్వర్లు కూలిపోయే దశకు చేరుకుంటాయని అంటున్నారు.



క్వార్టర్లలో ఏపుగా పెరిగిన ముళ్ళచెట్లు



దెబ్బతిన్న గేట్



నిరుపయోగంగా క్వార్టర్లు



పశువులకు స్థావరంగా మారిన భవనం

ఆర్టీసీ ఎండీ స్పందించాలి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కావటి రాజక్క ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడి వారంరోజులు గడుస్తున్నా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించకపోవడం బాధాకారమని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తిపాక గ్రామానికి చెందిన కావటి రాజక్క ఈనెల 12వ తేదిన చేపలు అమ్మి తిరిగి ఇంటికి వచ్చేందుకు హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగి రెండు కాళ్లు విరిగాయన్నారు. ప్రాణపాయ స్థితితో ఉన్న ఆమెను ఆర్టీసీ సంస్థ అండగా నిలవాలని, సంస్థ ఎండీ సజ్జనార్ పట్టించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రాజక్క కుటుంబాన్ని ఆదుకోని ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొంగర రాజశేఖర్, ప్రమోద్, తరుణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్లకు చెందిన అర్షం రాజేందర్, మేడ రామస్వామితోపాటు పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీరుకుళ్ల గ్రామకమిటీ అధ్యక్షుడు కిన్నెర ప్రేమ్‌చంద్, నాయకులు రాజు, కుమార్ పాల్గొన్నారు.